క్లుప్తంగా

కొనసాగుతున్న ఉద్యోగుల ఆందోళనలు



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డిపో డ్రైవర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం 35వ రోజూ కొనసాగాయి. జేఏసీ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ఉద్యోగులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎస్వీ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ధర్నాలు చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్వీ రమణను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ డిపో కార్యదర్శి టి. త్రిమూర్తులు, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమ్మెబాట పట్టిన క్వారీ కార్మికులు



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న క్వారీ కార్మికులు

ఏలేశ్వరం: తమ వేతనాల పెంపు పట్ల క్వారీల యజమానులు సానుకూలంగా స్పందించకపోవడంతో శుక్రవారం నుంచి సమ్మె చేపట్టినట్లు ఉభయగోదావరి జిల్లాల క్వారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుప్పల నాగభూషణం తెలిపారు. స్థానిక క్వారీ ప్రాంతంలోని యూనియన్ భవనంలో ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ కార్వీ యజమానులకు అనేక సార్లు వేతనాల పెంపుపై గడువు ఇచ్చినా సానుకూలంగా స్పందించకపోవడంతో సమ్మె చేపట్టామన్నారు. రెండేళ్లకొకసారి వేతనాలు పెంచేందుకు క్వారీ యజమానులు ముందుకు రాకపోవడం దారుణమన్నారు. క్వారీ వ్యాపారంలో నష్టాలు ఉండవని, లాభాలు కాస్తా తగ్గే అవకాశం ఉందన్నారు. తమ వేతనాలు పెంచుతూ నూతన అగ్రిమెంట్ చేసే వరకూ సమ్మె కొనసాగుతుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేరంగుల రాజు, బత్తిన రాజు, రాయుడు చిన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

తొండంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.రాజేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ప్రజాదర్బారులో ఎమ్మెల్యే యనమల దివ్య పాల్గొని ప్రజాసమస్యలపై అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

తంటికొండ దేవస్థానం అభివృద్ధికి కృషి

గోకవరం: మండలంలోని తంటికొండ దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. తంటికొండ దేవస్థానాన్ని శుక్రవారం టీడీపీ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. వారికి దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర ఆధ్వర్యంలో దేవస్థానం అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయంలో మూలవిరాట్ కదపకుండా ఆలయాన్ని రాతికట్టడం చేపడితే చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. దీనిపై త్వరలో టీటీడీ పాలకవర్గం సమావేశంలో చర్చించి నిధులు సమకూర్చడానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

జగ్గంపేట: ప్రస్తుత వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అత్తులూరి నాగబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పనితీరుపై ఎంపీపీ నాగబాబు సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా భరత్‌బాబు



అడపా భరత్‌బాబు

గోకవరం: జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు అడపా భరత్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల జాబితాలో విషయాన్ని వెల్లడించారు. పలువురు నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సంబరాలకు సర్వం సిద్ధం

- గ్రామాల్లో కొత్త అమావాస్య జాతరకు ఏర్పాట్లు పూర్తి
- ఎస్.అన్నవరంలో వైభవంగా శోభాయాత్ర



పెద్దిపాలెంలో నూకాలమ్మతల్లి బోనాలకు పూజలు చేస్తున్న మహిళలు



ఎస్.అన్నవరంలో 108 కలశాలతో శోభాయాత్ర చేస్తున్న మహిళలు

తుని రూరల్: కొత్త అమవాస్యను పురస్కరించుకుని నియోజకవర్గంలోని గ్రామాల్లో నూకాలమ్మతల్లి జాతర, తీర్థ మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి జాగరణ నిర్వహించి, శనివారం అమ్మవారి దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. డి.పోలవరం, కేఓ.మల్లవరం, రేఖవానిపాలెం, హంసవరం, తేటగుంట, టి.తిమ్మాపురం, ఎన్ఎస్‌వీ నగరం, ఎస్.సూరవరం, కుమ్మరిలోవ, లోవకొత్తూరు, రాపాక, తదితర గ్రామాల్లో ఆలయాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు. 15 రోజులుగా నిర్వహిస్తున్న అమ్మవారి గరగల సంబరాలు పూర్తవడంతో పాన్పులో ఉంచారు. ఎస్.అన్నవరం శివారు రైల్వే సబ్‌స్టేషన్ సమీపంలో ధారాలమ్మతల్లి జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, మహిళల కోలాటాలు, గరగల నృత్యాలు నడుమ 108 కలశాలతో మహిళలు తుని నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భారీ అన్నసమారాధన చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

శంఖవరం: మండలంలోని మండపం, కత్తిపూడి, శంఖవరం, జి.కొత్తపల్లి తదితర గ్రామాల్లో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టారు. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పించనున్నారు. తప్పెటగుళ్లు, గరగలు, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలయాల వద్ద భద్రత ఏర్పాటు చేశారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం, ఒమ్మంగి, ధర్మవరం తదితర గ్రామాల్లో కొత్త అమావాస్యను పురస్కరించుకొని నూకాలమ్మతల్లి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్దిపాలెంలో నూకాలమ్మ బోనాల పండుగను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు, యువతులు అమ్మవారి బోనాలను నెత్తిన పెట్టుకుని గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకొని బోనాలు, చీర, సారెలను అమ్మవారికి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి శక్తివేశాలు, తీన్‌మార్ డ్యాన్సులు, తప్పెటగుళ్లు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శనివారం నూకాలమ్మ తల్లి తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. మండలంలోని ఒమ్మంగి, ధర్మవరం గ్రామాల్లోనూ నూకాలమ్మతల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి.

ఘనంగా గంగాలమ్మ జాతర

తొండంగి: కొత్త అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని ఏవీ నగరంలో రెండు రోజుల పాటు జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా మహిళలు గండదీపాలు వెలిగించి గ్రామదేవత గంగాలమ్మకు సమర్పించారు. గంగాలమ్మ ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారెలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సిరికి ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన గరగ నృత్యాలు, తప్పెటగుళ్లు, అధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు.



రేఖవానిపాలెంలో సుందరంగా ముస్తాబైన నూకాలమ్మ తల్లి ఆలయం



కత్తిపూడిలో విశేష అలంకరణలో నూకాలమ్మతల్లి

వైభవంగా నూకాలమ్మతల్లి తీర్థం



నూకాలమ్మతల్లిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన నూకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జాతర నిర్వహించారు. తెల్లవారుజామున పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి, మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అమ్మవారికి చీర, సారే, పండ్లు సమర్పించారు. అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు యనమల కృష్ణుడు, మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఎమ్మెల్యే యనమల దివ్య అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సహస్ర లింగార్చన



రత్నగిరిపై సహస్ర లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

అన్నవరం: మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రత్నగిరిపై దర్బారు హాలులో సహస్ర లింగార్చన ఘనంగా నిర్వహించారు. మట్టితో శివలింగాలను చేసి వాటికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకుడు దత్తాత్రేయశర్మ, పురోహితులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లి పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. 514 మంది విద్యార్థులకు గాను 504 మంది హాజరైనట్టు చెప్పారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద వసతులు కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు చిట్టిబ్బాయి (ఫైల్)

తొండంగి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై జగన్మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..శంఖవరం మండలం సీతంపేట గ్రామానికి చెందిన చిరు వ్యాపారి పిర్ల చిట్టిబ్బాయి (27) గురువారం రాత్రి స్వగ్రామం నుంచి జాతర సందర్భంగా అత్తవారింటికి ఏవీ నగరం బైక్‌పై బయలు దేరాడు. ఏవీ నగరం వెళ్లే రహదారిలో కొమ్మనాపల్లి జంక్షన్ వద్ద ఆగిఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలపాలైన అతడిని స్థానికులు, కుటుంబ సభ్యులు పిఠాపురం సమీపంలో ట్రినిటీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతునికి రెండేళ్ల క్రితం వివాహం కాగా భార్య వెంకటలక్ష్మి, తొమ్మిది నెలల కుమారుడు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

ఏలేశ్వరం: ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను శుక్రవారం ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం జరిగింది. వైఎస్సార్ సీపీ యూత్ విభాగంగా అధ్యక్షుడిగా సకురు గుర్రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బొట్టా చైతన్య, రైతు విభాగం అధ్యక్షుడిగా కొట్టేడి రాయుడు, బీసీసెల్ అధ్యక్షుడిగా సరణం శ్రీను, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా గుడాల వెంకటరత్నం, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా చెన్నాడ సత్తిబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సయ్యద్ అమీర్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మాసా ఇమ్మానియేల్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా దూడల శివకుమార్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా నడిగట్ల త్రిమూర్తులు, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా రామిశెట్టి దొరబాబు, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా దేవర లక్ష్మణ్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా గొల్లపల్లి దొరబాబు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గణేశుల లక్ష్మణస్వామి, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా గిడుతూరి శ్రీరాములు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా వాగు బలరామ్, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా అంబల లోవలక్ష్మి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా పలివెల నాగేంద్ర రాజు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా సన నూకరాజు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా గోళ్ల నాగేశ్వరరావు, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా బూడి రమణ, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా నూనె శ్రీనివాసరావు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా సూరాబత్తుల శ్రీనివాస్, ఇంటిలిజెన్స్ ఫోరం అధ్యక్షుడిగా ఏడిద రెడ్డినాయుడు, బూత్ కమిటీల వింగ్ అధ్యక్షుడిగా ఎస్.చిన్నారావు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా సురమర్ల మధు నియమితులయ్యారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



గోకవరం జామియా మసీదులో ఇఫ్తార్ విందు ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: స్థానిక జామియా మసీదులో ముస్లింలకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు దంపతులు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. తొలుత మసీదులో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, దాసరి చినబాబు, సుంకర వెంకటరమణ, ఎస్ఎస్ అలీషా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బిజ్జి రాజు, బాడితబోయిన చిన్నా, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

తుని: స్థానిక రోటరీ హాలులో రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే యనమల దివ్య శుక్రవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివ్య మాట్లాడుతూ రంజాన్ శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి విందు స్వీకరించేందుకు వచ్చిన ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజాఅశోక్‌బాబు, కుసుమంచి శోభారాణి, యనమల రాజేష్, సుర్ల లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: రంజాన్ సందర్భంగా పట్టణంలో ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక మార్కెట్ రోడ్‌లోని మసీదులో ముస్లింలకు టీడీపీ నేతలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, గొల్లపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఒమ్మంగిలో అగ్ని ప్రమాదం

- రెండు పూరిళ్లు దగ్ధం
- రూ.5 లక్షల ఆస్తి నష్టం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మొగలి పెద్ద సత్తిబాబు, మొగలి కృష్ణ, మొగలి మూలయ్య, మొగలి దావీదులకు చెందిన ఇళ్లు గ్రామ శివారు శరభవరంలో రోడ్డులో ఉన్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అర్ధరాత్రి ఇళ్ల నుంచి మంటలు వ్యాప్తి చెందాయి. ఇదే సమయంలో ఇళ్లల్లోని గ్యాస్ సిలిండర్లు పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మూడు కుటుంబాలు హైదరాబాద్‌లో ఉంటుండగా ఒక కుటుంబం వైద్య నిమిత్తం కాకినాడ వెళ్లింది. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇళ్లలోని గృహోపకరణాలు, రెండు మోటార్ సైకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ముద్రగడ

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారు. అధికారులు తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, సీంద్రపు భాస్కరరావు, కొప్పన వెంకన్నబాబు, సాదనాల అప్పారావు, కొప్పన గంగరావు, రామకుర్తి రవిబాబు, రామిశెట్టి దొరబాబు బోనాల వెంకటేష్, దారా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తుని: పల్లెల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్థానిక సీపీఎం నాయకుడు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రజా ప్రతినిధులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పోలవరం కాలువ నిర్మాణంలో భూమి కోల్పోయి తిరిగి ఇల్లు కట్టుకునే పేదలను కూటమి నేతలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. భూమి లేని నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనాలు చెల్లించాలి



పి.రవి (ఫైల్)

గోకవరం: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించాలని తూర్పుగోదావరి జిల్లా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సంఘం ట్రెజరర్ పి.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెలాఖరు నాటికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) టెండర్ ముగియనుందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలను గమ్యస్థానాలకు చేర్చడం అత్యంత నైపుణ్యంతో పనిచేస్తున్నామని, కాని తొమ్మిదేళ్లుగా కెప్టెన్లకు (డ్రైవర్లు) కేవలం రూ.7,800 వేతనం మాత్రమే అందుతుందన్నారు. ఈ అరకొర జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఈసారి టెండర్లు పిలిచినప్పుడు కెప్టెన్ల జీతాలను దృష్టిలో ఉంచుకొని కనీస వేతనం రూ.18,500 వచ్చేలా చూడాలన్నారు. సిబ్బందికి బీమా, ఇతర అలివెన్సులు కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను నెరవేర్చని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు: ప్రస్తుత వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు స్థానిక పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం, స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శుక్రవారం సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, కార్యదర్శి పద్మరాజు ప్రారంభించారు. వేసవి ముగిసే వరకూ చలివేంద్రాలను కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ జేఏ శ్రీనివాసు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, ఓసీ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరుకు చేసుకున్న దరఖాస్తులను శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ వెంకటనారాయణ పర్యవేక్షణలో భీమవరపుకోట కెనరాబ్యాంకు, పాతకొట్టాం యూనియన్ బ్యాంకు, స్థానిక ఎస్‌బీఐ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు 240 మంది దరఖాస్తుదారుల ధ్రువపత్రాలను పరిశీలించారు.

తుని: స్వయం ఉపాధి నిమిత్తం బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా బ్యాంకు రుణాల మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను శనివారం పరిశీలించనున్నట్టు స్థానిక మున్సిపల్ కమిషనర్ వెంకటరావు శుక్రవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వార్డు సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట మధ్య హాజరు కావాలన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ అప్లికేషన్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, రైస్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను తమవెంట తీసుకురావాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

తుని రూరల్: కంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి నేత్రాలను సంరక్షించుకోవాలని ఎమ్మెల్యే యనమల దివ్య సూచించారు. ఎస్.అన్నవరం శివారు గెడ్లబీడు సాయివేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోగులకు ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ ఆర్‌కే కుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. ఇన్‌చార్జ్ తుని మున్సిపల్ చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి, మాజీ చైర్‌పర్సన్లు కుసుమంచి శోభారాణి, యినుగంటి సత్యనారాయణ, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ గంట్ల చిన్నారావు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభించి, కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే దివ్య

పనిదినాల కల్పనలో 'గండేపల్లి'కి ద్వితీయ స్థానం



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

గండేపల్లి: ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించడంలో గండేపల్లి మండలం జిల్లాలో రెండో స్థానంలో ఉందని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నూరుశాతం పనులు కల్పించి ప్రథమ స్థానానికి చేరుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి కూలీలకు పనికి తగ్గ వేతనాలు వచ్చే విధంగా చూడాలన్నారు. కూలీలకు వేసవిలో అదనపు వేతనం కలుస్తుదన్నారు. గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో స్వల్ప తప్పిదాలను గుర్తించినట్టు తెలిపారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు ఎన్ఆర్‌జీఎస్, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర పనుల నిమిత్తం రూ.12,29,13438 ఖర్చుకుగాను తప్పిదాల్లో రికవరీ నిమిత్తం రూ.42 వేలు, ఫైన్ రూ. 2000లకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఏపీడీ ఎం.భానుప్రకాష్, విజిలెన్స్ అధికారి రవి శంకర్, హెచ్‌ఆర్ రాజేష్, ఏఓ చంద్రరావు, ఎస్ఆర్పీ సింహాద్రి, ఎంపీడీఓ నాతి బుజ్జి, ఏపీఓ గంగాభవాని, తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలులో తనిఖీలు



ప్రత్తిపాడు సబ్ జైలులో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి

ప్రత్తిపాడు: స్థానిక సబ్ జైలు (ఉప కారాగారం)ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి శుక్రవారం సందర్శించారు. సబ్ జైలులోని రిజిస్టర్లు, రికార్డులు తనిఖీ చేశారు. వంటశాల, ఖైదీలుండే గదులు, పరిసరాలను పరిశీలించారు. ఖైదీలకు అందించే ఆహార పదార్థాలను క్షుణంగా తనిఖీ చేశారు. నాణ్యమైన ఆహారం అందుతుందా ? లేదా ? అని ఖైదీలను ఆరా తీశారు. ఖైదీలందరికీ న్యాయవాదులు ఉన్నారో.. లేదో... అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఎమైనా ఇబ్బందులుంటే ఫిర్యాదుల పెట్టెలో చీటి రాసి వేయవచ్చన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్లు వచ్చినపుడు చీటీలను సంస్థ కార్యదర్శికి అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్లు నాగమల్లేశ్వరరావు, అవసరాల దేవి, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, పారా లీగల్ వలంటీర్ నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.10 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు కంచిబట్ల సాయిరామ్, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి అర్చకుడు దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వనదుర్గ అమ్మవారికి నేడు ప్రత్యంగిర హోమం

అమావాస్య పర్వదినం సందర్భంగా శనివారం వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొనవచ్చన్నారు.

స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యం



టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలు

జగ్గంపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి, వారికి స్వయం ఉపాధి కల్పించడమే గ్రామ పునర్నిర్మాణ సంస్థ (వీఆర్ఓ) లక్ష్యమని సంస్థ డైరెక్టర్ ఎస్.ఇమ్మానియేల్ తెలిపారు. జగ్గంపేటకు చెందిన వీఆర్ఓ సంస్థ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లోని 99 మంది మహిళలకు నాలుగు నెలలు పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇచారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం సంస్థ డైరెక్టర్ ఇమ్మానియేల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా మహిళలకు, యువతకు వివిధ రంగాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. వీఆర్ఓ సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్.సుధాకర్, ఫైనాన్షియల్ మేనేజర్ సీఆర్‌పీ బోస్కో, ప్రాజెక్టు మేనేజర్ కమాలకర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.